ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 సంచిక : 10 జూన్ 2014

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

📱 9247104551

ఈ సంచికలో....

జిన్నూరు

27-04-2014

1995

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 📱 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-04-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్ 1950 ఏప్రియల్ 14వ తేదీన సాయంత్రం గం॥ 8-47 ని॥లకు శరీరం విడిచిపెట్టారు. ఇంకా కొద్ది టైములో శరీరం పోతుంది అనగా సోఫాలో పడుకున్న ఆయన కూర్చోబెట్టమని చెప్పారు. క్యూలో భక్తులు దర్శించుకొంటున్నారు. ఆయన కొంతమంది వంక చూసి చిరునవ్వు నవ్వారు, కొంతమందిని చిన్నచిన్న మాటలతో పలకరించారు, కొంతమందిని చూసి కన్నీరు తెచ్చుకొన్నారు. ఆయన ఏమి చేసినా అది అనుగ్రహమే. భగవాన్ కనుక శరీరమే అయితే ఇప్పుడు ఆయన లేనట్లే. భగవాన్ శరీరం ఉన్నప్పుడు కూడా ఆ శరీరం ఆయన కాదు. భగవాన్ రేపు శరీరం విడిచిపెడతారు అనగా కొంతమంది భక్తులు ఏమన్నారు అంటే మీ శరీరం పడిపోయేలాగ ఉంది. ఇప్పుడు మీరు మమ్మల్ని ప్రేమిస్తున్నారు. ఈ శరీరం పోయాక ఇంక మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు అని అడిగారు. ఇప్పుడు ఈ శరీరం ఉంది. ఈ శరీరం ఉన్నప్పుడు కూడా శరీరం మిమ్మల్ని ప్రేమించటంలేదు. శరీరానికి చావు ఉన్నమాట నిజమే కాని ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి చావులేదు. ఈ శరీరం పడిపోయినా మిమ్మల్ని ప్రేమించే వస్తువుకు చావులేదు కాబట్టి అది మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటుంది, అనుగ్రహిస్తూనే ఉంటుంది, మీకు బ్రాహ్మీస్థితి కలిగేవరకు అది మిమ్మల్ని విడిచిపెట్టదు. భగవాన్ మరణానుభవం ద్వారా మరణాన్ని జయించి అమృతత్వాన్ని పొందారు. శరీరం మరణించేటప్పుడు ఈ శరీరం పోయినా నేను ఉంటాను అనే అనుభవం ఆయనకు కలిగింది. అంటే ఆయన ఇమ్మోర్టల్‌స్థితిని

పొందారు. మనం దేహం పోయేటప్పుడు మనం కూడా పోతున్నాము అనుకొంటాము. అంటే మనం మోర్టల్స్.

నేను ఉద్యోగం చేసుకొంటున్నాను. ఉద్యోగానికి రాజీనామా చేసి ఆత్మజ్ఞానం పొందటంకోసం నిరంతరం కృషిచేస్తూ తరించాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మీకు లోపల పక్వత లేకుండా, అర్హత లేకుండా మీరు చేసే పనులు మానుకోకూడదు. ఇంటిదగ్గర మీరు చేసే పనులు చేస్తూనే ఉండాలి. మనస్సు శుద్ధి అవ్వకుండా, మనస్సుకు పవిత్రత రాకుండా మీరు పని విడిచిపెట్టేసినా అటు పనికి కాకుండా పోతారు, ఇటు జ్ఞానం కూడా రాదు. అందుచేత మీ మనస్సు ఎంతవరకు శుద్ధి అయ్యింది, దానికి ఎంతవరకు పవిత్రత వచ్చింది, ఏకాగ్రత వచ్చింది అని చూసుకోవాలి. పచ్చికాయను ఎవరు తింటారు. కాయ బాగా ముగ్గాలి కదా! ఈశ్వరుడు కూడా అంతే. మీకు లోపల బాగా పక్వత వస్తే ఆయన మిమ్మల్ని తీసుకుంటాడు కానీ పచ్చికాయను ఆఫర్ చేస్తే ఆయన తీసుకోడు. మీ మనస్సు పచ్చిగా ఉండకూడదు, మనస్సులో పుల్లతనం ఉండకూడదు. మనస్సు తియ్యగా అవ్వాలి. ఆ స్థాయి మీకు వచ్చిందో లేదో భగవంతుడు చూస్తాడు. ఆ స్థాయి రాకుండా నువ్వు ఉద్యోగం విడిచిపెడితే ఇటు ఉద్యోగం పోతుంది, అటు జ్ఞానం రాదు. రెండు విధాల నష్టపోతావు. ఇలా చాలామంది పాడైపోతారు. మేము చాలా ఎడ్వాన్స్‌డ్‌సోల్స్, రీలైజ్డ్‌సోల్స్ అనుకొంటూ ఇటు లోకానికి, అటు దైవానికి కాకుండా పాడైపోయే వారిని చాలామందిని చూస్తున్నాను. భగవాన్ ఏమంటున్నారు అంటే భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయనను తెలుసుకోవటానికి నువ్వు ఉద్యోగానికి రాజీనామా చెయ్యనక్కరలేదు. ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోవలసిన పనిలేదు. సన్యాసం అంటే తెల్లబట్టలు తీసేసి ఎర్రబట్టలు కట్టుకోవటంకాదు. లేకపోతే కుటుంబ సభ్యులపట్ల నీకు ఉన్న ప్రీతిని బలవంతంగా తెంపుకొని ఎక్కడికో పారిపోవటంకాదు. కుటుంబ సభ్యులపట్ల మీకు ఉన్న ప్రేమని తెంపుకొని పారిపోయినంతమాత్రంచేత మీకు జ్ఞానంరాదు. లోపల పక్వత లేనప్పుడు మీరు ఇంటి దగ్గర ఉన్నా, అడవిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా ఒక్కటే. మీరు ఎక్కడ ఉన్నా లోపల మీ మనస్సు తయారవ్వాలి. మీ మనస్సుకు పవిత్రత, ఏకాగ్రత, ప్రవీణత రావాలి. ఇవి రావటానికి మీకు ఇంటిదగ్గర ఉన్నా, అడవిలో ఉన్నా సాధన చెయ్యాలి. మీరు ఇంటిదగ్గర టైముకు కాఫీ తాగుతూ, టైముకు అన్నంతింటూ మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు సాధన చేయలేకపోతే, ఎక్కడికో అడవిలోనికి వెళ్లి జంతువుల మధ్యన, మీకు పరిస్థితులు అక్కడ

అనుకూలంగా లేనప్పుడు మీరు ఏమి సాధన చేయగలరు. అందుచేత ఇంటి నుండి పారిపోతే జ్ఞానం రాదు సరికదా మీకు కష్టాలు వస్తాయి.

మనస్సులో ఉన్న వాంఛలను తగ్గించుకుంటూ, మీ కుటుంబసభ్యుల పట్ల డ్యూటీ చేస్తూ మమకారం తగ్గించుకోవాలి. పైకి పనిచేస్తూ ఉండాలి, వారిమీద మనస్సులో మమకారం ఉండకూడదు. ఎటాచ్‌మెంట్ పనికిరాదు, డిటాచ్డ్ ఎటాచ్‌మెంట్ అవసరం. మీరు ఇంట్లో కుటుంబసభ్యులపట్ల మీ డ్యూటీ చేస్తూ ఉండాలి కాని వారికి మనకు సంబంధం లేదని లోపల మీకు తెలుస్తూ ఉండాలి. అంటే మీ ఇంట్లో పని మనిషి ఎలా ఉంటుందో మీరు కూడా అలాగే ఉండాలి. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే మీ ఇంట్లో ఉన్న పనిమనిషి మీ పిల్లలను ఎత్తుకొంటుంది, వారికి పాలు పట్టిస్తుంది, వారిని ఆడిస్తూఉంటుంది. మనకంటే పిల్లలను ఆ పనిమనిషే ఎక్కువగా ప్రేమిస్తోందేమో అని మీకు అనిపిస్తూ ఉంటుంది. మీ ఇంట్లో ఎంత విశ్వాసపాత్రంగా పనిచేసినా, మీ పిల్లలను ఎత్తుకొని ముద్దాడినా ఎక్కడో హృదయాంతరాళాలలో ఈ పిల్లలు నా వాళ్ళు కాదు అని ఆ పనిమనిషికి తెలుసు. ఆ పనిమనిషి యజమాని ఇంట్లో ఎలా పనిచేస్తోందో అలాగ మీరు ఇంట్లో పనిచేయాలి. ఇంట్లోవారి కోసం ఏ పని చేసినా, వారికి కష్టం వస్తే ఏదైనా సహాయం చేసినా, వారికి అనారోగ్యం వస్తే హాస్పటల్‌కి తీసుకొనివెళ్ళినా లోపలమటుకు వాళ్ళు నావాళ్ళుకాదు అని గుర్తు పెట్టుకోండి. డ్యూటీ చెయ్యండి. భగవంతుడు మీకు కేటాయించిన పని నుండి పారిపోవద్దు. పనిమనిషే మీకు గురువు. ఇంట్లో వారిపట్ల మీకు ఎటాచ్‌మెంట్ ఉన్నా, ఆ పనిమనిషిలాగ ఆ ఎటాచ్‌మెంట్ డిటాచ్డ్‌గా ఉండాలి. అది మనస్సుకు అంటుకోకూడదు. మీ ఎటాచ్‌మెంట్ డిటాచ్డ్‌గా ఉంటే హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, మీకు ఈశ్వరదర్శనం కలుగుతుంది. మీ కుటుంబసభ్యులను విడిచిపెట్టి, మీరు చెయ్యవలసిన డ్యూటీ చేయటం మానేసి పారిపోవటం వలన మీకు జ్ఞానం రాదు, దానివలన మీకు సోమరితనం వస్తుంది. మీ డ్యూటీ ఏదో మీరు చేయండి. డ్యూటీ చేస్తున్నామని హృదయంలో ఉన్న ఈశ్వరుని విడిచిపెట్టకండి. ఒకచేత్తో మీ పనులు చేసుకొంటూ రెండోచేత్తో ఈశ్వరుని పాదాలను పట్టుకోండి. రెండు చేతులు కుటుంబసభ్యులకు ఇచ్చేస్తే మీరు ఈశ్వరునికి దూరమైపోతారు. కర్మలను అనుభవించటం కోసం ఈ కుటుంబంలోనికి వచ్చారు. ఇది టెంపరరీ. మీకు ఈశ్వరునికి ఉన్న సంబంధం శాశ్వత సంబంధం కాని ఇవన్నీ మాయ సంబంధాలు. నీ శరీరమే నిజం కానప్పుడు ఆ శరీరంతో ఎవరినైతే ప్రేమిస్తున్నావో వాళ్ళ శరీరాలు మటుకు

నిజమా? ఆమాత్రం నీకు తెలియటంలేదా? లోపల భగవంతుడిని స్మరించటం మానేసి బట్టలు మార్చుకున్నంత మాత్రంచేత, ఇల్లు విడిచిపెట్టినంతమాత్రంచేత నీకు జ్ఞానం వస్తుందా? సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటంకాదు. నీకు ఉన్న కోరికలను, వాంఛలను, నీకు ఉన్న అహంకారాన్ని, మమకారాన్ని తగ్గించుకోవటమే నిజమైన సన్యాసం. ఉద్యోగానికి రాజీనామా చేయటంకాదు. భగవంతుడితో రాజీపడటం నేర్చుకో. భగవంతుడు నీ శరీరానికి ఒక పని కేటాయించాడు. భగవంతుడు మీకు ఇచ్చిన పనిని విడిచిపెట్టి పారిపోవద్దు. ఎక్కడికి పారిపోతారు, ఎక్కడికి వెళ్ళినా మీ మనస్సు మీ కూడా వస్తుంది. ఎస్కేపిజం వలన జ్ఞానం రాదు. మీ మనస్సులో అనేక బలహీనతలు ఉండవచ్చు, వాటిని ఫేస్ చెయ్యండి. ఆ బలహీనతల నుండి విడుదల పొందటానికి మీరు ప్రయత్నం మొదలుపెడితే ఈశ్వరసహాయం కూడా అందుతుంది. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం. మీ ప్రయత్నం మీరు చెయ్యండి, కాలం కలిసి వస్తుంది, ఈశ్వరానుగ్రహం వస్తుంది. మీరు అందరూ బ్రాహ్మీస్థితిని పొందుతారు.

భగవంతుడు నీ దేహానికి ఒక బాధ్యతను ఇచ్చాడు. ఆయన ఇచ్చిన బాధ్యతనుండి ఎక్కడికి పారిపోతావు. భగవంతుడితో రాజీపడు. అందుచేత భగవంతుడు కేటాయించిన పని నుండి ఎలా తప్పించుకోవాలి అని ప్రయత్నం చేయవద్దు. మనస్సులో భగవంతుడిని ధ్యానం చేసుకొంటూ ఆయన ఇచ్చిన పనిని నిర్మలంగా, నిశ్చలంగా చెయ్యి. అది ఒక డ్యూటీ. అదే గమ్యం కాదు. "నన్ను భజించండి, నన్ను ప్రేమించండి, నన్ను మాత్రమే గమ్యంగా పెట్టుకొని కుటుంబసభ్యులపట్ల మీ డ్యూటీ చేయండి. వారిని మీ మనస్సులో మొయ్యవద్దు" అని పరమాత్మ చెపుతున్నాడు. కుటుంబసభ్యులను బాగానే చూడండి అని మీరు చెపుతున్నారు. వారు అంత మంచివారు కాదు అని మీరు అంటే అది భగవంతుడికి తెలియదా? అదొక రకమైన ప్రారబ్ధం. దానిని అనుభవించటానికే నిన్ను ఆ కుటుంబంలో పడేసాడు. నువ్వు బాగా చేసినా ఒక్కోసారి వారు మొట్టికాయలు మొడుతూ ఉంటారు. వారి ద్వారా నువ్వు నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయి, వారి ద్వారా నువ్వు వికాసం పొందాలి అందుచేతనే ఆ కుటుంబంలో నిన్ను పెట్టాడు. అయ్యబాబోయ్ ఇటువంటివారి మధ్య పడేసావు ఏమిటి అని అనుకోవద్దు. క్షీరాన్నం నోటిలో పోసుకున్నట్లు ఆ చెడ్డవారి మధ్యన కూడా నువ్వు ఎంజాయ్ చెయ్యి. అప్పుడు నీ ప్రారబ్ధం అంతా ఖర్చు అయిపోతుంది, నువ్వు మోక్షాన్ని పొందుతావు.

గీతలో పరమాత్మ ఏమన్నాడు అంటే "ఓ అర్జునా! నువ్వు ఎవరినైతే చంపుదామని అనుకొంటున్నావో వారినందరిని నేను చంపేసి ఉంచాను. నేను ఎవరినైతే చంపేసి

ఉంచానో వారిని నువ్వు చంపటం అంటే చేసే పని నాది, నువ్వు చేతులు ఆడించటమే.” అర్జునుడిలాంటి మహావీరుడినే అలా అంటే మనం ఎంత? మన జీవితాలు ఎంత? భగవంతుడు మన జీవితంలో సాధించి పెట్టిందే మనం చేసాము అనుకొంటున్నాము, మనకు అహంకారం ఉంటుంది కదా యిది మేమే సాధించాము అంటాము. మనం కర్తృత్వం పెట్టుకోవటంకాని జరిగేది అంతా ఈశ్వర సంకల్పమే. ఉన్నవాడు ఆయనే. మనం అంటూ లేనే లేము. వూరికే ఉన్నట్లుగా కనిపిస్తున్నాము అంతే. జీవితంలో జయం వస్తూ ఉంటుంది, అపజయం వస్తూ ఉంటుంది. జయం వచ్చినప్పుడు ఎలా ఉన్నాము, అపజయం వచ్చినప్పుడు ఎలా ఉన్నాము వాటికి మన మనస్సు సమానంగా ఉంటోందా అనేది భగవంతుడు చూస్తాడు. బయట సంఘటనలు ఆయన చూడడు. ఇప్పుడు నేను మాట్లాడుతున్నాను. నాన్నగారు బాగానే మాట్లాడుతున్నారు అని మీరు అనుకోవచ్చుకాని భగవంతుడు అలా అనుకోడు. నాన్నగారి నోటినుండి మాట వచ్చినప్పుడు దానివెనకాల ఉన్న తలంపు ఏమిటి? ఏ ప్రేరణ వలన ఆ మాట వస్తోంది? అని ఆ తలంపును భగవంతుడు చూస్తాడు కాని నా మాటను ఆయన చూడడు. మీరు నా మాటలు వింటారు. ఆ మాట చెప్పేటప్పుడు లోపల ఉద్దేశం ఏమిటి అని భగవంతుడు చూస్తాడు. అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. మనలను నడిపించేవాడు ఆయనే. ఆయన నిర్ణయించిన వాడే ప్రధానమంత్రి అవుతాడు. ఎవడికి ప్రధానమంత్రి అయ్యే యోగం ఉందో వాడికి ఓటువేసేలాగ నీకు సంకల్పం తీసుకొని వస్తాడు. అంటే వాడిని ప్రధానమంత్రి చేసినవాడు నువ్వా? లేక భగవంతుడా? భగవంతుడే చేసాడు. ఆ విషయం మనకు తెలియదు. అదేకాదు ప్రతీ చిన్న విషయం కూడా అంతే. అధికారం, డబ్బు, పాండిత్యం యివన్నీ మత్తు. మనం ఏ అధికారం కోసం అయితే కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నామో దానిని ‘పందిపెంట’ అన్నాడు రామకృష్ణుడు. ఇదంతా ఆయన దర్శించి చెపుతున్నాడు. నీ కుటుంబ సభ్యులు మంచివారా, చెడ్డవారా అనేది నీకు అనవసరం. నువ్వు మమకారం తగ్గించుకొని వారిపట్ల నీ డ్యూటీ ఏదో చెయ్యి. నీ చేతులు వారి గురించి పని చేస్తున్నప్పటికీ, నీ మనస్సును వారికి స్వాధీనం చెయ్యవద్దు, నీ మనస్సును భగవంతుని పాదాల దగ్గర పెట్టు. నువ్వు భగవంతుడితో రాజీపడి నీ డ్యూటీ ఏదో నువ్వు చేస్తూ ఉంటే నీకు వేరుభావన పోతుంది. అంటే ఈ దేహము లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని అనుకోకుండా నువ్వు ఎప్పుడైతే భగవంతుడితో రాజీపడ్డావో నువ్వు, ఈ ప్రపంచం, దేవుడు అంతా ఒక ముద్ద అయిపోతారు. అది లాజిక్కు.

మీకు మమకారం తగ్గినప్పుడు, మీకు వ్యక్తి భావన తగ్గినప్పుడు మీ ప్రేమ యూనివర్సల్ అయిపోతుంది. అంటే అప్పటివరకు మీ కుటుంబానికే పరిమితమైన ప్రేమ ఇప్పుడు యూనివర్సల్ అవుతుంది అంటే ప్రపంచం అంతా పాకిపోతుంది. ఇదే బుద్ధుడి జీవితంలో ఆయన డ్రైవర్ అంటాడు. “మీరు కుటుంబసభ్యులను, రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవటం బాగాలేదు, మీరు పొరపాటు చేస్తున్నారు” అని బుద్ధుడితో చెపుతాడు. “నువ్వు చెప్పింది న్యాయంగానే ఉంది. వీరిని విడిచిపెట్టి వెళ్లటం మంచిదా అని నువ్వు అడుగుతున్నావు. అంటే నాకు ఉన్న ప్రేమను వారికే పరిమితం చేయమంటావా? లేక సృష్టికంతా పంచిపెట్టమంటావా? ఈ నలుగురికేనా నా ప్రేమను పంచేది? ఇక్కడికే పరిమితం చేయమంటావా? వీరి శోకాన్ని మాత్రమే ఆర్పితే సరిపోతుందా?” అంటాడు బుద్ధుడు.

మీ చేతులనిండా బాడి, దుమ్ము ఉంటే ఏ వస్తువును శుభ్రం చేస్తారు. మీ చేతులనిండా బాడి ఎలా ఉందో అలాగ మీ మనస్సు అంతా రాగద్వేషాలతోటి, అసూయతోటి నిండి ఉన్నప్పుడు ఎవరికి మీరు శాంతిని ఇవ్వగలరు. మేము చనిపోయిన తరువాత ఎక్కడికి వెళతాము అని చాలామంది అడుగుతారు. ఏదో కైలాసానికో, స్వర్గానికో, నరకానికో ఎక్కడో ఒకచోటుకు వెళ్లిపోతారు. స్వర్గం గురించి, కైలాసం గురించి మన పురాణాలలో చాలాగొప్పగా చెపుతారు. కాని మనం మొహమాటం లేకుండ ఇక్కడ సత్యమే చెప్పాలి. ఇప్పడు మీరు అర్థం చేసుకొన్నా, చేసుకోకపోయినా ముందునాటికైనా మీరు అర్థం చేసుకొంటారు. మీ శరీరం చనిపోయాక ఏ జీవుడైతే ప్రయాణం చేస్తున్నాడో ఆ జీవుడు ఎంత నిజమో ఈ కైలాసం, వైకుంఠం, స్వర్గం, నరకం ఇవన్నీ కూడా అంతే నిజం. ఇవన్నీ పారమార్థిక సత్యాలుకాదు. ఒకవేళ మీరు స్వర్గానికి వెళ్లినా గోయింగ్ ఉన్నవాడికి కమింగు ఉంటుంది. అక్కడనుండి ఏదోరోజున భూమిమీదకు రావలసిందే. మీకు వాసనాక్షయం పూర్తి అయ్యేవరకూ ఏదో లోకానికి వెళుతూఉంటారు, వస్తూఉంటారు. ఎప్పుడైతే పూర్తిగా వాసనాక్షయం అయ్యిందో అప్పడు మీ హృదయంలో ఉన్న సుఖసముద్రం, శాంతిసముద్రం పొంగివచ్చి మీ సహస్రాన్ని ముంచేస్తుంది. అప్పడు మీరు పొందే సుఖంతో పోల్చదగినది ఈ లోకంలోగాని, స్వర్గంలోగాని ఎక్కడా ఏమీ లేదు అని మీకు తెలుస్తుంది.

అనేకమంది పేదవారు ధనవంతులు అవ్వటం, ధనవంతులు పేదవారు అవ్వటం, అధికారం ఉన్నవాడికి ఊడిపోవడం, లేనివారికి అధికారం రావటం ఇవన్నీ మనం చూస్తున్నాముకదా! ఇవన్నీ టెంపరరీ. కాలప్రవాహంలో ఇవి అన్నీ కొట్టుకొనిపోతాయి. నీ

శరీరమే కాలప్రవాహంలో కొట్టుకొనిపోతున్నప్పడు, ఆ శరీరానికి వచ్చే అదృష్టాలు, దురదృష్టాలు ఎంతకాలం ఉంటాయి. మీ దేహప్రారబ్ధంలో మంచి ఉన్నా, చెడ్డ ఉన్నా అది కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. మీకు ఉన్న బంధాలను తగ్గించుకొంటే, మీకు ఉన్న ప్రేమను కొద్దిమందికే పరిమితం చేయటం తగ్గించుకొంటే, మీరు మమకారాన్ని తగ్గించుకొంటే అప్పడు మీ ప్రేమ, ఆప్యాయత ఒక కులంతోటి, జాతితోటి, మతంతోటి సంబంధంలేకుండా, ఒక ప్రాంతంతో సంబంధంలేకుండా, వారు స్త్రీలు, వీరు పురుషులు అనే విచక్షణ లేకుండా ఈ ప్రపంచం అంతటికీ పాకిపోతుంది. నీకు ఉన్న ప్రేమ, ఆప్యాయత ప్రపంచం అంతా వ్యాపించినప్పడు ఉద్యోగం మానేయాలి అనికాని, ఇంటినుండి పారిపోదాము అనికాని ఇటువంటి బుద్ధి కలగనే కలుగదు. కంగారు పడవద్దు. మీకు అందరికీ నిర్వాణసుఖం అందుతుంది. బాగా పండినపండు ఉంది అనుకోండి. మీరు దానిని చెట్టున ఉండమంటే ఉండదు, దానంతట అదే రాలిపోతుంది. అలాగే ఏది ఎప్పడు జరగాలో అప్పడు జరుగుతుంది. దానికోసం ఎదురు చూడవద్దు. ఆకాలం వచ్చినప్పడు మీరు అందరూ మోక్షానుభవాన్ని పొందుతారు. ఎప్పడు వస్తుంది అని ఎదురు చూడవద్దు. ఎదురుచూడటం వలన దుఃఖం వస్తుంది. మీ జీవితాన్ని ఎప్పడు మలుపు తిప్పాలి, మీకు నిర్వాణసుఖాన్ని ఎప్పడు ఇవ్వాలి అనేది ఈశ్వరుడు చూసుకొంటాడు. తెల్లబట్టలు కట్టుకొంటే నేను గృహస్థుడనుఅని, ఎర్రబట్టలు కట్టుకొంటే నేను సన్యాసిని అని నీలోపల ఉన్న అహంకారమే ఇటువంటి తలంపులను తీసుకొని వస్తుంది. సన్యాసి నేను సన్యాసిని అని, గృహస్థుడు నేను గృహస్థుడను అని అనుకొంటాడు. ఇదా నువ్వు చేసేది. నువు ఆత్మస్వరూపుడవు, చైతన్యస్వరూపుడవు. నువ్వు ఏదిగా ఉన్నావో దాని స్మరణ వదిలేసి దేహబుద్ధితో నేను గృహస్థుడిని, నేను సన్యాసిని అని ఇలాగ మానసిక అవరోధాలు పెంచుకొంటున్నావు.

మనకు తెలిసినా, తెలియకపోయినా మన హృదయంలో ఒక నిజం ఉంది. అది మనోదేహములకు అతీతమైనది. అది నేనై ఉన్నాను. ఆ నిజాన్ని నువ్వు శరీరంగా ఉండు అంటే నాకు చేతకాదు అంటోంది. నువ్వు మనస్సుగా ఉండు అంటే నాకు చేతకాదు అంటోంది. శరీరంగా ఉండమంటే చనిపోవటం, పుట్టటం ఇవన్నీ ఉంటాయి అందుచేత శరీరంగా ఉండలేను. మనస్సుగా ఉంటే వికారాలు వస్తాయి అందుచేత మనస్సుగా ఉండను అని హృదయంలో ఉన్న నిజం చెపుతోంది. మనం నేను, నేను అంటున్నాము కదా! అది దేహగతమైన నేను. అది నేను శరీరంగా ఉంటాను, మనస్సుగా ఉంటాను అని

చెపుతోంది. నువ్వు శరీరంగా మనస్సుగా ఉంటే ఉండు. హృదయంలో ఉన్న నిజంగా కూడా ఉండు అంటే నిజం ఎలా ఉంటుందో నాకు తెలియదు అందుచేత ఆ నిజంగా ఉండలేను అని ఇది చెపుతోంది. హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ శరీరాలు వస్తూ ఉంటాయి, చనిపోతూ ఉంటాయి, అదో చక్రం, ఆ చక్రంలో మనం తిరుగుతూ ఉండవలసిందే. ఈ చక్రంలోనుండి నిన్ను విడుదల చేయటమే మహాత్ముల యొక్క లక్ష్యం. బుద్ధుడు అయినా, రాముడు అయినా, కృష్ణుడు అయినా, రమణుడు అయినా ఏ గురువు అయినా నిన్ను ఈ జననమరణ చక్రంనుండి విడుదల చేయటానికే ప్రయత్నం చేస్తారు. అదే వారి లక్ష్యం. మీతో మాట్లాడుతూ, మీతో తిరుగుతూ మీలోఉన్న బలహీనతలను గ్రహించి వాటిని బయటకులాగి కాల్చి, బూడిద చేయటమే గురువుయొక్క లక్ష్యం.

అందుచేత మీ వలన ఏదైనా పనులు అవుతూ ఉన్నా ఇదంతా మా వల్లనే అయిపోయింది అని అనుకోవద్దు. అంతా ఈశ్వరసంకల్పం వలన అవుతోంది. ఒకవేళ మీరు ఏదైనా మంచిపనులు చేసారు అనుకోండి. ఆ మంచిపనులు మేమే చేసాము అనుకోవద్దు. భగవంతుడు అనుగ్రహిస్తే మీరు ఆ మంచి పనులు చేసారు. భగవంతుడి అనుగ్రహం లేకపోతే మీ వల్ల ఏమీకాదు. మీలో మంచిపనులు చేసినవారు ఉండవచ్చు. అవి దేవుని అనుగ్రహం వలననే చేసారు కాని మీ తెలివితేటల వలన కాదు. మేము ప్రయత్నం చేసి చాలా కష్టపడిచేసాము అని అనుకోవద్దు. మనలను పనిముట్టుగా పెట్టుకొని ఈశ్వరుడు ఆ పనులు చేసాడు అనే భావనతో మీరు ఉంటే మీరు ధన్యులు, భగవంతుడి అనుగ్రహానికి పాత్రులవుతారు. ఏది ఆలోచించినా నెగిటివ్‌గా ఆలోచించవద్దు, పాజిటివ్‌గా ఆలోచించాలి. మీరు ఏదైనా పనిచేస్తే అది అహంకారంకోసం చేయకూడదు. మీరు నోటితో ఏదైనా మాట్లాడుతూ ఉంటే అది అవసరం ఉంటే మాట్లాడాలికాని అహంకారంకోసం మాట్లాడవద్దు. మనకు ఏదైనా తలంపులు వస్తే అది మన గౌరవం పెంచుకోవటానికో, అహంకారం పెంచుకోవటానికో రాకూడదు. మనకు వచ్చే తలంపులు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి మనకు ఉపయోగపడేలాగ ఉండాలి. ఏ దిక్కుకు చూసినా, ఏ మూలకు చూసినా మంచి ఆలోచనలు, నన్ను ఉద్ధరించే తలంపులు నా మెదడులో ప్రవేశించు గాక! ఎటుచూసినప్పటికీ మంచి ఆలోచనలు నా హృదయంలో ప్రవేశించి ఆధ్యాత్మిక వికాసానికి సహాయపడుగాక అని వేదంలో ఉంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1995)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సు యొక్క పుట్టుస్థానం మనకు తెలియకపోయినా మనస్సు తెలుస్తోంది కదా! మనస్సు యొక్క పుట్టుస్థానం మనలోపలే ఉంది. మనస్సు దాని పుట్టుస్థానమును చూస్తేగాని అది నశించదు. అందుచేత దాని మూలంలోనికి మనస్సును పంపాలి. తేలిక మనుషులకు ఇది రాదు. తూకం పెరగాలి. పైపైన ఈతలు కొట్టేవారికి నీటిలో పడిపోయిన వస్తువు దొరకదు. నీటిలో మునిగే శక్తిని సంపాదించి లోపలకు దిగితేనేగాని వస్తువు దొరకదు. మనస్సు ఇప్పుడు మెదడులో ఉంది. దానిని హృదయంలో ముంచు. హృదయంలో మునిగే శక్తిని మనస్సుకు కలుగజెయ్యి. మనస్సుకు బరువు పెరగాలి, నిష్కామకర్మ వలన కూడా మనస్సుకు తూకం పెరుగుతుంది.

మనలాగే జ్ఞాని కూడా మనుషులను గుర్తుపడుతున్నాడు కదా అంటే వాడికి మనస్సు ఉన్నట్లు మనకు తెలుస్తోంది అని భగవాన్‌ను అడిగితే జ్ఞానికి మనస్సు ఉంటుంది కాని అది పగటి చంద్రుడు అన్నారు భగవాన్. అంటే పగలు కూడా చంద్రుడు ఉంటాడు కాని ఆయన ప్రభావం ఉండదు. అలాగే జ్ఞానికి మనస్సు ఉంటుంది కాని దాని ప్రభావం ఉండదు, అది వాడిని బంధించదు. మనం ప్రేమలేని మనుషులం కాదు. మనకు దేవుని మీద ప్రేమ ఉంది కాని ఏదో కారణం పెట్టుకొని, కోరిక పెట్టుకొని భగవంతుడిని ప్రేమిస్తాము. అంటే మన ప్రేమలో దోషం ఉంది. మనకు భగవంతుడి మీద ప్రేమ ఉండాలి కాని దానికి కారణం కనబడకూడదు. అటువంటి ప్రేమను భగవంతుడు అడుగుతున్నాడు. అటువంటి ప్రేమవలన మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. మనం నిరంతరం భగవంతుడిని ప్రేమించాలి, ఆయనను నిరంతరం ధ్యానించాలి.

అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు, ఆయన లేని రూపంలేదు, ఆయన లేని నామం లేదు. జ్ఞాని మనలాగే అందరిని చూస్తాడు కాని దేనికీ ఆకర్షింపబడడు. జ్ఞాని అంటే బ్రహ్మం అయి ఉన్నాడు. ఆయన వివిధ నామరూపములను చూసేటప్పుడు కూడా వాటికి ఆధారంగా ఉన్న బ్రహ్మంనే చూస్తాడు. అంటే ఆయనను ఆయనే చూసుకొంటున్నాడు. అందువలన ఆకర్షణ కలుగదు. ఇంటిలోని వారు చనిపోయినప్పుడు మనం ఏడుస్తాము. చనిపోయినవారి గురించి ఏడవటంకాదు. వారి గురించి ఎవడైతే ఏడుస్తున్నాడో వాడు

బయట లేడు, నీ లోపలే ఉన్నాడు. వాడికి ఇంకా చావు రాలేదని ఏడవండి అన్నారు భగవాన్. వాడికి చావు వస్తే ఇంక మిగిలేది మోక్షం. భగవాన్ తల్లి బాధపడుతూ ఉంటే ఎవరైనా వెళ్ళి ఆయనతో చెపితే ఏడవనివ్వండి. దుఃఖం అంతా బయటకు వచ్చేయటం మంచిది. పూర్తిగా బయటకు రాకుండా మరణం వస్తే మిగిలింది ఏడవటానికి మరల జన్మ ఎత్తాలి. ఏడుపు అంతా బయటకు వస్తే ఉన్నది మోక్షమే అనేవారట భగవాన్. మోక్షం కలిగితే నువ్వు దుఃఖం లేకుండా ఉండటమే కాదు, ఆనంద ప్రవాహంలో, శాంతి ప్రవాహంలో కొట్టుకొనిపోతావు. అది అనిర్వచనీయమైనది.

మనస్సుకు లోచూపు నేర్పండి, మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో ముంచండి అని చెపుతున్నారు అలా చేయలేకపోతున్నాము అని భగవాన్‌ను అడిగితే మీ ప్రాంతంలో ఉన్న సాధువులతోటి, సత్పురుషులతోటి సహవాసం చెయ్యండి అని చెప్పారు. సత్పురుషుల సహవాసం వలన మనస్సు హృదయంలో ఉండటానికి శిక్షణ పొందుతుంది. 24 గంటలు వంట చేసుకొనే గదిలో ఉంటూ మసి అంటించుకోకుండా ఉండటం ఎంత కష్టమో మనం చెడు సహవాసంలో ఉండి చెడ్డను అంటించుకోకుండా ఉండటం కూడా అంతే కష్టం. అందుచేత స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. మీరు పనిని విడిచిపెట్టవద్దు. పని ద్వారానే శిక్షణ పొందాలి. పని చేసేటప్పుడు మనలోని బలహీనతలు తెలుస్తాయి. బలహీనతలు తెలిసినప్పుడు వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేస్తాము. శరీర ధర్మం ప్రకారం మనం చేయవలసిన పనులు మనం చేయాలి. ఎవరో చేస్తున్నారు అని ఆ పనులు మీరు చేయవద్దు. అనుకరణ వద్దు. నీ చేతిలో ఉన్న పనిని హృదయపూర్వకంగా చెయ్యి. దేవుని దగ్గర పువ్వులు ఎలా పెడుతున్నామో, పండ్లు ఎలా పెడుతున్నామో అలాగే పని వలన వచ్చే ఫలితాన్ని దేవుని దగ్గర పెట్టండి. దీని వలన వ్యక్తిభావన నశిస్తుంది.

కేవలము మంచి గ్రంథాలు చదవటం వలననే మోక్షం రాదు. అవి కొంతవరకు సహాయం చేస్తాయి, వాటివలన బుద్ధి వికశిస్తుంది. చైతన్యస్థాయిలో అభివృద్ధిలో ఉన్న వారిని పట్టుకొని ప్రయత్నించాలి. జ్ఞానం పొందాలంటే గురువు అనుగ్రహం ఉండాలి. ఆత్మ చింతన తప్ప ఇతర చింతలు పుట్టుటకు కొంచెం కూడా చోటు ఇవ్వకు అనేవారు భగవాన్. ఆత్మ తప్ప మిగిలిన విషయములన్నీ జడములు. ఇతర విషయాలు మీద ఆపేక్ష పెట్టుకోవద్దు. ఇతర విషయాల మీద ఆపేక్ష పెట్టుకొంటే అవి ఆత్మవైపుకు వెళ్ళకుండా నీకు అడ్డుపడి నిన్ను ప్రకృతి వైపుకు లాగేస్తాయి. ప్రకృతి గుణాలు దాటకుండా బ్రహ్మానుభవం కలుగదు. అనాత్మకు

సంబంధించిన విషయాల మీద అపేక్ష పెట్టుకోవద్దు. వాటిమీద ఆపేక్ష ఉంటే ప్రకృతి గుణాల నుండి బయటపడలేవు. కొంతమంది పుట్టినది మొదలు, స్మశానంకు వెళ్ళేవరకు మనస్సు గురించి, శరీరం గురించి ఆలోచిస్తారు. ఆత్మగొడవ వారికి ఉండదు. నువ్వు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే ఆత్మ తప్ప మిగిలిన గొడవలలోనికి వెళ్ళవద్దు. శరీరము మీద, మనస్సు మీద ఆపేక్షను వదులుకో.

చనిపోయిన తరువాత స్వర్గమునకుగాని, నరకమునకుగాని వెళితే వెళ్ళవచ్చు. నీ చదువును బట్టి, తెలివిని బట్టి నరకము, స్వర్గము రాదు. నువ్వు చేసిన కర్మనుబట్టి మరణానంతర జీవితంలో స్వర్గము, నరకము వస్తాయి. పరమార్థం అందుకోవాలంటే నీకు తెలివి అవసరమే కాని తెలివితోపాటు వినయము, నమ్రత ఉండాలి. వినయము, నమ్రత ఉంటే మనం బాగుపడతాము. వినయము, నమ్రత లేకుండా తెలివి ఉంటే మనం బాగుపడము సరికదా ఆ తెలివి నిన్ను పాడుచేసే ప్రమాదం ఉంది. దేహమును, మనస్సును శుచిగా ఉంచుకో. వాటిని జాగ్రత్తగా చూసుకో. వాటిని సాధనకు ఉపయోగించుకో. దేహము బయట ఉన్న పనిముట్టు. మనస్సు లోపల ఉన్న పనిముట్టు. ఈ రెండు పనిముట్లను ఉపయోగించుకొని నువ్వు మోక్షాన్ని పొందాలి. శరీరానికి స్నానం చేయిస్తే సరిపోదు మనస్సుకు కూడా స్నానం చేయించాలి. ప్రార్థన మనస్సుకు స్నానం. కామక్రోధముల వలన మనస్సుకు అశుచి పెరిగిపోతూ ఉంటుంది. లోపల శుచి కావాలంటే కామక్రోధాలను తగ్గించుకోవాలి అని పరమాత్మ చెపుతున్నాడు. బహుజన్మల కృషి వలన కామక్రోధాల వేగం తగ్గుతుంది. చేసిన కృషి వూరికే పోదు. కామక్రోధముల వేగం ఎంతవరకు తగ్గిందో అంతవరకు మనస్సు శుచి అవుతుంది.

మనం మొక్కలు నాటుతాము. మొదట ఆకులు, రొబ్బలు వస్తాయి. తరువాత పండు వస్తుంది. మనం మొక్క వేసేది ఆకులకోసం, రొబ్బలకోసం కాదు, పండుకోసం వేస్తాము. ఆకులు, రొబ్బలు వచ్చాయి, ఇంక పండు అక్కరలేదు అని మనం అనుకొంటామా? అలా అనుకోము. మనం చేసే యజ్ఞాలు, యాగాలు, కర్మలు అన్నీ ఆకులు, రొబ్బలు వంటివి. ఆత్మజ్ఞానం పండువంటిది. మన సాధనల యొక్క ప్రయోజనం ఆత్మజ్ఞానాన్ని పొందాలి. మనం యజ్ఞాలు, యాగాలు చేయటమే కాదు, వాటిద్వారా ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలి. పరమ ప్రయోజనం అదే. ఈ శరీరం ఉండగానే ఎవడైతే బ్రహ్మానుభవాన్ని పొందాడో వాడు శరీరం ఉన్నప్పుడు సుఖమును, శాంతిని, ఆనందాన్ని అనుభవిస్తాడు, మరణానంతరం కూడా అదే ఆనందాన్ని

అనుభవిస్తాడు. అన్నిచోట్ల, అన్నికాలాలలో అతనికి సుఖమే, ఎక్కడ చూసినా శాంతే. దుఃఖం, అశాంతి అతనిని ముట్టుకోవు. మనస్సులో పక్షపాతం రాకుండా చూసుకో. లోకంలో కొంతమంది నీకు ఉపకారం చేయవచ్చు. కొంతమంది అపకారం చేయవచ్చు. ఉపకారం చేసిన వారి మీద నీకు పక్షపాతం వస్తుంది, నీకు పక్షపాతం వస్తే మనస్సు నా దగ్గరకు రాదు వారి దగ్గరకు వెళ్ళి వాలుతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. ఎవరైనా ఉపకారం చేసినా, అపకారం చేసినా సమానంగా చూడటం నేర్చుకో. అప్పడు పక్షపాతరోగం పోతుంది.

---

**అరుణాచలా!**

# ఓం శ్రీ నాన్న సద్గురు దేవులకు ప్రణామములు

## ఓం నమో భగవతే శ్రీ రమణాయ!

| | |
|---|---|
| సూర్యుడు మనం ఏమీ కోరకుండానే | వేడిమిని, వెలుతురును యిచ్చి జీవకోటిని బ్రతికిస్తున్నాడు |
| చంద్రుడు మనం అడగకుండానే | చల్లని వెన్నెల యిస్తూ పంటలకు, ఓషధులకు పుష్టిని యిస్తున్నాడు |
| భూమాత మనం కోరకుండానే | మనకు ఆధారమై ఓర్పుగా జీవులను జీవితకాలం మోస్తున్నది |
| మేఘములు మనం అర్థించకుండానే | మనకు వర్షాన్ని కురిపించి జలాలను యిచ్చి జీవనాధారమైనవి |
| వృక్షములు మనం కోరకుండానే | మనకు ఫలములను, కలపను యిచ్చి మహోపకారం చేస్తున్నాయి |
| పశువులు మనం అడగకుండానే | పాలును యిచ్చి మన శరీరమును పోషిస్తున్నాయి |
| భగవంతుడు | మనలను సృష్టించి మన అంతరంగంలో వుండి మనలను ప్రారబ్ధాన్నిబట్టి ఆడిస్తున్నాడు |
| సద్గురు దేవులు (శ్రీ నాన్నగురుదేవులు) | తమ జ్ఞాన నేత్రములతో మనలను (భక్తులను) వీక్షించి, జ్ఞానమును, శాంతిని ప్రసాదిస్తున్నారు |

ఇట్లు

**(నాన్నగారి పాద ధూళి)**

**సయ్యపరాజు వెంకటరామరాజు, గుడ్డిగూడెం**

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# జగత్తు మనోకల్పితమే

భగవాన్ శ్రీ రమణమహర్షిని కొంతమంది భక్తులు మా ఊరు, మా ప్రాంతాలను చూపిస్తాం! మాతో రండి అన్నప్పుడు, దానికి బదులుగా భగవాన్ అక్కడ కూడా పంచభూతాలే కదా! అక్కడ ఏమైనా ఆరవభూతం ఉందా? అనేవారు. మనము ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా అక్కడ ఉండేవి పంచభూతాలే, అట్టి పంచభూతాలు వాటికి అధిష్ఠానమైన ఆత్మమీద అధ్యాసగా ఏర్పడినవే! మరియు ఆ పంచభూతాలతో నిర్మితమైనదే మన శరీరం. ఈ ప్రపంచం రజ్జు సర్ప భ్రాంతిలాంటిది. ప్రపంచమును 'ఆత్మ' కన్న భిన్నముగా భావిస్తే అది అసత్యమే, దానికి స్వతంత్రమైన ఉనికిలేదు. మన తలంపు ఎంత నిజమో, ప్రపంచమూ అంతే నిజం. మనము ప్రతీరోజూ ఒకేరకమైన ప్రపంచాన్ని చూస్తున్నట్లుగా కనిపిస్తున్నప్పటికీ, ఎవరికి వారు తన సంకల్పాన్నిబట్టే ప్రపంచాన్ని చూస్తారు, కాబట్టి జగత్తు మనోకల్పితమే తప్ప మరొకటి కాదు. కేవలం ఉన్నదే చైతన్యము, అదే 'నేను'. వాస్తవంగా నేనెవరో? అనుభవైక వేద్యం కావాలంటే వివేకము, వైరాగ్యము, అంతర్దృష్టి అవసరం, మరియు గురువు యొక్క అనుగ్రహం అత్యంత కీలకం. ప్రపంచ విషయాలవైపు పరుగెత్తే మనస్సును వెనుకకు, దాని స్వస్థానమైన హృదయంలోనికి అంతర్ముఖం చెయ్యాలి. భగవాన్ ఏమి మాట్లాడినా అది అంతరం గురించే కాని, బాహ్యం గురించి కాదు. రాగిపాత్రకు పట్టిన చిలుము చింతపండుతో తోమితే పోతుంది, అలాగే మలిన మనస్సు స్వరూపచింతనచేత నిర్మలమవుతుంది. ప్రతిరోజు ఈ దేహం నశించిపోయేదేనని గుర్తుచేసుకోవాలి. బద్ధకాన్ని దరిచేరనివ్వకూడదు. సజ్జన సాంగత్యము చెయ్యాలి. మంచి పుస్తకాలు చదవాలి. మన సకల సాధనలు దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడానికే!

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# కృష్ణస్తు భగవాన్ స్వయం - 1

ఉండునది ఒక్కటే. దాన్ని ప్రాజ్ఞులు అనేక నామాలతో పిలుస్తారు. శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం ఏర్పడిన ఉపాధి. మహాభారత యుద్ధానికి సూత్రధారి, సంధి ప్రయత్నం సఫలంకాక యుద్ధం చేయించాడు. మహాసంగ్రామం మధ్య అర్జునుని నెపంగా పెట్టుకొని లోకానికి తత్వబోధను భగవంతుడై చెప్పిన గీత. ఆయన అంటారు "నేను శరీరం ధరించకపోతే భగవంతుడు లేడు అనుకొంటారు. శరీరం ధరిస్తే అవమానిస్తారు. నేను ఒక్క కర్మను ఒక్క క్షణం చేయకపోతే ఊరక ఉంటే ఈ సర్వజగత్తు నాశనమైపోవును" అన్నారు. అంటే ఆయన శక్తి ఈ లోకంలో నిద్రపోవుచున్నది అనుట అసందర్భము. ఆ సృజన శక్తి పనిచేస్తున్నది విశ్రాంతిలేదు అని అర్థం. ఆయనది లీలావతారం. గీతలో 'నేను' అని ఆయన ఉదహరించినది ఆత్మనే సూచిస్తుంది. "నన్నే శరణుపొందు అంటే ఆత్మలోనే సంస్థితుడై ఉండని అర్థం. భక్తిరూపమగు ఉపాసన సర్వత్ర శ్రేష్టము. ఈ భక్తిని జ్ఞానముకన్న సత్యాన్ని సులభంగా పొందవచ్చు. జ్ఞానమార్గమునకు అనుకూల పరిస్థితులు, తీవ్రసాధన అవసరం. భగవంతుని ఎడల గాఢమైన ప్రేమ, భక్తి కావాలి. ఆ భక్తి యొక్క గొప్పసుగుణం వల్ల మనస్సు నిర్మలము, పవిత్రము చేస్తుంది. దేశకాల విచక్షణ లేక నిరంతరం భగవంతుని లేదా సద్గురువుని స్మరిస్తూ ఉండాలి. శ్రీ నాన్నగారు "మనస్సుకు రూపం అంటే ఇష్టం. మీ ఇష్టదైవాన్ని నిరంతరం స్మరించటం వల్ల సత్యదర్శనమవుతుంది. సాధనలో ఇది తేలిక మార్గం" అన్నారు. అన్నమయ "నామ జపం వెల బహు సులభం - ఫలమధికం" అన్నారు. గోపికలకు శ్రీకృష్ణుడు జగన్నాధుడు, సర్వశక్తివంతుడు, పరంధాముడు అని వినుటయందు వారికి ఆశక్తిలేదు. ఆయన అఖండ ప్రేమమూర్తి అని మాత్రమే అని పరిగణించారు. ఆయన గోపాలుడే అని వారి భావన. గోపికల ఆర్తి "మాకు ధనమక్కరలేదు, జనమక్కరలేదు, పాండిత్యమక్కరలేదు, స్వర్గప్రాప్తి అక్కరలేదు ఎన్ని జన్మలు మాకు కలుగుగాక దేవా! నీ ఎడల భక్తి ఉండునట్లు అది నిష్కామ భక్తి ఉండునట్లు అనుగ్రహించుము" అని ప్రార్థించారు. భక్తి భక్తి కొరకే, కర్మ కర్మ కొరకే, ధర్మము ధర్మము కొరకే అను ఈ భావము శ్రీకృష్ణావతారంలో ఉత్తమోత్తమముగా ఆయన ముఖం నుండి ప్రప్రదమముగా వెలువడినది. రాధాకృష్ణులు "భగవంతుణ్ణి ఏవిధంగా ఆరాధించినా సరే పరితాపము ఒక్కటే ఆయన దర్శనానికి అవశ్యకం" అన్నారు. భగవాన్ రమణులు "బ్రహ్మానుభూతికి 'ఆర్తి' మార్గం" అన్నారు. భక్తకన్నప్ప దీనికి ఉదాహరణ. శ్రీకృష్ణుడు షోడశ కళలతో ఉద్భవించిన అవతార మూర్తి. బాగుపడేవారంతా భాగవతం చదువుతారు. మన స్వరూపం పొందటానికి అది చాలు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**